సాక్షి బాపట్ల

శుక్రవారం । 3 । మార్చి । 2023



సజావుగా పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక గుంటూరు జిల్లాలో గురువారం 94.01 శాతం పంపిణీ పూర్తయింది. సాయంత్రానికి 2,38,058 మందికి రూ.65.40 కోట్ల నగదు అందజేశారు.



ఆర్టీసీ బస్సు బోల్తా

రేపల్లెరూరల్: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని కారుమూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎవరికీ ప్రమాదం జరగలేదు.



ఉగాదికి నిర్మాణాలు పూర్తిచేయాలి

అద్దంకిరూరల్: గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తిచేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గురువారం బొమ్మనంపాడు జగనన్నలే అవుట్‌ను పరిశీలించారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 21 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శాంతి విశాల గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లోని ఖాళీ సీట్లు, అభ్యర్థుల విద్యార్హతలు తదితర వివరాల కోసం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసంhttps://apgpcet.apcfss.in, https://apgpcet. apcfss.in/inter వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

నేడు జెడ్పీలో భేటీ కానున్న స్థాయీ సంఘాలు


గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాలు శుక్రవారం భేటీ కానున్నాయి. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకుగాను 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జెడ్పీలోని ఆమె ఛాంబర్‌లో జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. 3వ స్థాయీ సంఘానికి సంబంధించి వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, 5వ స్థాయీ సంఘం స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, 6వ స్థాయీ సంఘం సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నారు. స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కానున్న అధికారులు ఆయా శాఖల వారీగా ప్రగతితోపాటు గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర వివరాలతో హాజరు కావాలని జెడ్పీ సీఈవో జె.మోహనరావు కోరారు.

యార్డులో 1,06,842 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,01,900 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,06,842 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,642 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పోషకాహారం



బల్లికురవ: ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రతి రోజూ మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందని, ప్రతి విద్యార్థి భోజనం చేసేలా ఉపాధ్యాయులు అవగాహన పెంచాలని ఆర్జేడీ వీవీ సుబ్బారావు, బాపట్ల డీఈవో పీవీజే రామారావు ఆదేశించారు. గురువారం మండలంలోని వేమవరం, పాతమల్లాయపాలెం, నక్కబొక్కలపాడు పాఠశాలలను ఆర్జేడీ, డీఈఓలు వేర్వేరుగా తనిఖీ చేశారు. వేమవరంలో విద్యార్థులు రాసిన వర్క్‌బుక్‌లో లోపాలను సక్రమంగా చూడకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతమల్లాయపాలెంలో పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లపై అవగాహనతో విద్యార్థులకు బోధిస్తుండటంతో హెచ్‌ఎం ఎస్ ప్రభాకరరావు, ఉపాధ్యాయులను ఆర్జేడీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తనిఖీలో ఎంఈవో బీ.వీరరాఘవయ్య పాల్గొన్నారు.

గతి తప్పిన బాల్యం

- చిన్న వయసులోనే చెడు అలవాట్లు
- కుటుంబంలో నిరాదరణ
- ఇద్దరి చావుకు కారణమైన మైనర్లు
- వ్యక్తిత్వ లోపాలు ప్రధాన కారణమంటున్న మానసిక వైద్యులు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- అసాంఘిక శక్తులపై పీడీయాక్ట్ పెడతాం: జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



వాచ్‌మన్‌పై దాడి చేస్తున్న మైనర్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: బాల్యం గతి తప్పుతోంది. మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు లోనై తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా ఇతరుల జీవితాలను కూడా నాశనం చేస్తున్నారు. చెడు స్నేహితులు, ఇంట్లోని పరిస్థితులు వారిని మరింత పాతాళానికి నెట్టేస్తున్నాయి. గుంటూరు నగరంలో మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు మైనర్లు విచక్షణారహితంగా వ్యవహరించారు. ఇద్దరు వాచ్‌మెన్‌ల ప్రాణాలు తీయడంతోపాటు, కనపడిన వారందరిపై దాడి చేశారు. పలుషాపుల్లో చోరీకి పాల్పడటంతోపాటు ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. ప్రశాంతంగా ఉండే గుంటూరు నగరంలో ఈ సంఘటనలు భయాందోళన కలిగించాయి. బతుకుతెరువు కోసం వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్న వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎన్నడూ లేని విధంగా గుంటూరు నగరంలో జరిగిన ఇలాంటి భయానక సంఘటనలు మళ్లీ చోటుచేసుకోకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ లేకపోవడం, బిజీ జీవితంలో పడిపోయి పిల్లలు ఎలా ఉంటున్నారు, ఏం చేస్తున్నారనే విషయాలను తల్లిదండ్రులు గమనించకపోవడం, ప్రాశ్చాత్య పోకడలకు యువత అలవాటు పడడం, ఆర్థిక కారణాలు, చెడు వ్యసనాలకు బానిసలైపోవడం తదితర కారణాలతో యువత ఈ మధ్యకాలంలో హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి హింసాత్మక ధోరణి వల్ల సమాజం భయాందోళనకు గురవుతోంది. ఇలాంటి సంఘటనలు కట్టడి చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాల్సి ఉంది. మంగళవారం హత్యలకు పాల్పడిన మైనర్ల కుటుంబ నేపథ్యం కూడా ఇదేవిధంగా ఉండటం గమనార్హం. ఒక మైనర్ సోదరుడు కూడా చిన్నచిన్న దొంగతనాలు చేస్తుంటాడని సమాచారం. మరో మైనర్ దొంగతనాలు చేసి జువైనల్ హోంకి వెళ్లి వచ్చాడు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత కుటుంబసభ్యులు అతనిని దూరంగా ఉంచడంతో మరింత కసి పెంచుకుని చెడు వ్యసనాలకు బానిస అయినట్లు తెలుస్తోంది. యువతలో నేర ప్రవృత్తి ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. వీరు కొంత మంది గ్రూపులుగా ఉండి నేరాలు చేయడం తరచూ జరుగుతోంది. ఒంటరిగా చేసే వారు కూడా ఉంటారు. యుక్త వయస్సులోనే నేరప్రవృత్తికి పాల్పడేవారు స్నేహితులతో కలిసి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడతారు. ఒంటరిగా నేరాలకు పాల్పడే వారిలో కొంత మానసిక సామాజిక పరిపక్వత ఉంటుంది. వీరిపై స్నేహితుల ప్రభావం ఉండదని మానసిక నిపుణులు చెబుతున్నారు. అయినా వీరు నేరాలకు పాల్పడడానికి కారణం వీరిలో భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడమే. వీరు సామూహిక ఒంటరితనానికి లోనై ఉంటారు.

వ్యక్తిత్వ లోపాలు ప్రధాన కారణం



పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం సరిగా ఉండకపోవడం, తల్లిదండ్రుల ఆదరణ లేకపోవడం, సంరక్షణ లోపించడం, పర్యవేక్షణ లేకపోవడంతోపాటు మానసిక రుగ్మతలు ప్రధాన కారణం. తల్లిదండ్రుల్లో మానసిక వ్యాధులు, నేరప్రవృత్తి ఉండటం, పేదరికం, చిన్నతనంలో క్రమశిక్షణ లేకపోవడం వల్ల కూడా ఇలా జరుగుతుంది. వీరిలో వస్తున్న మార్పులను చిన్నతనంలోనే గుర్తించి కుటుంబపరంగా, సామాజికపరంగా స్కూల్ పరంగా మల్టీసిస్టమ్యాటిక్ థెరపీ చేయాలి. కుటుంబానికి, వ్యక్తికి కౌన్సెలింగ్ చేయాలి. మానసిక రుగ్మతలుంటే ఔషధాలు వాడడం వలన ప్రయోజనం ఉంటుంది.

– డాక్టర్ ఇంటూరి శరత్‌చంద్ర, మానసిక వ్యాధి నిపుణులు, గుంటూరు

చెడు వ్యసనాల బారిన పడవద్దు



యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. నేర ప్రవృత్తి కలిగిన వారికి దూరంగా ఉండాలి. చిన్నవయస్సులోనే నేరాలకు పాల్పడటం వల్ల వారి భవిష్యత్ అంధకారంగా మారుతుంది. వారి చర్యల వల్ల వారి కుటుంబాలతో పాటు బాధిత కుటుంబాలు కూడా నష్టపోతాయి. అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై నిఘా పెట్టడంతో పాటు వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తాం.

–ఆరిఫ్ హఫీజ్, జిల్లా ఎస్పీ

సామూహిక నేరప్రవృత్తికి కారణాలు

- యువతలో వ్యక్తిపరంగా, స్నేహితులపరంగా, కుటుంబసభ్యుల మధ్య సంబంధాలు ప్రభావితం చేస్తాయి.
- స్నేహితుల గ్రూపులో ప్రాధాన్యత పొందడానికి వారి ఒత్తిడికి లోనవుతారు.
- చదువును అశ్రద్ధ చేసి విలాసాలకు అలవాటు పడడం
- మత్తు పదార్థాలకు అలవాటు పడడం

యువతలో కాండక్ట్ డిజార్డర్

- ఇతరులను కొట్టడం, దాడి చేయడం, రేప్ చేయడం వంటివి
- ఇతరుల హక్కులకు భంగం కలిగించడం
- దొంగతనాలు, దొమ్మీ, అబద్ధాలు, మోసం చేయడం తదితరాలు
- ఇంట్లో నుంచి, కాలేజీ, స్కూల్ నుంచి పారిపోవడం
- చెడు స్నేహాలు కలిగి ఉంటారు



● ఆత్మీయ స్వాగతం

విశాఖపట్నంలో రెండు రోజులపాటు జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్(జీఐఎస్)లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం అక్కడి ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని. - సాక్షి ఫొటోగ్రాఫర్

జీబీసీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం

ముప్పాళ్ల: గుంటూరు బ్రాంచి కాలువలోకి కారు దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఇరువురు సురక్షితంగా బయటపడ్డారు.సంఘటన గురువారం తెల్లవారుజామున పలుదేవర్లపాడు సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన రూపెనగుంట్ల ఘన్‌సైదా, భార్య మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు రావాలంటూ సైదా భార్య ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గంగ్రెడ్డిపల్లిలోని తమ్ముడు దూదేకుల నరసింహారావుకు కబురు చేసింది. ఆయన తన మిత్రుడు తుంగా సాయికుమార్‌తో కలిసి కారులో పలుదేవర్లపాడు గ్రామానికి వచ్చారు. ఇరువురి మధ్య వివా దం పెరగటంతో కారులో తిరుగు ప్రయాణమయ్యా రు. అప్పటికే తెల్లవారుజాము కావటంతో వారి వెనకాలే ఘన్‌సైదా బయలుదేరాడు. ఊరు దాటాక గుంటూరు బ్రాంచి కాలువ వద్ద మలుపు ఎక్కే క్రమంలో కారు నేరుగా కాల్వలోకి దూసుకెళ్లింది. వెనకాలే వస్తున్న ఘన్‌సైదా సమాచారాన్ని పోలీసులకు అందించారు. సంఘటనా స్థలానికి చేరిన పోలీసులు కారులో ఉన్న ఇరువురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కారును క్రేన్‌తో స్థానికులు బయటకు తీశారు.



కాలువ నుంచి కారును బయటకు తీస్తున్న స్థానికులు

సమర్థంగా శింగరకొండ తిరునాళ్ల

- 600 మంది బందోబస్తు
- మూడు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, ఫ్లెక్సీలు నిషేధం
- ఆర్డీఓ సరోజిని



మాట్లాడుతున్న ఆర్డీఓ సరోజిని

అద్దంకి: అన్ని శాఖలు సమన్వయంతో సమర్థంగా శింగరకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలని చీరాల ఆర్డీఓ సరోజిని అన్నారు. ఆర్డీఓ అధ్యక్షతన శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులు, తిరునాళ్ల సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆమె గురువారం నిర్వహించారు. సమావేశం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఈఓ సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న శింగరకొండ 68వ వార్షిక తిరునాళ్లలో తీసుకోనున్న చర్యలు, ఏర్పాటు చేయనున్న వసతుల గురించి చర్చించారు. దేవదాయ శాఖ తరఫున పిల్లలకు పాలు, బిస్కెట్లు, మజ్జిగ మంచి నీళ్ల దేవస్థానంలో క్యూలైన్ల ఏర్పాటు, బయో టాయిలెట్లు, ఉచిత ప్రసాదాల పంపిణీ, రూ.50, రూ.100 ప్రత్యేక దర్శన వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏసీ సుభద్ర తెలిపారు.

కొండపైకి ప్రత్యేక బస్సులు

శింగరకొండపైనున్న లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోనున్న భక్తుల కోసం కొండపైకి దాతల సాయంతో ప్రత్యేక బస్సులు, అన్నదానం, ఉచిత ప్రసాద పంపిణీ చేస్తామని ఈఓ కోటిరెడ్డి చెప్పారు. శింగరకొండపాలెం గ్రామ పంచాయతీ తరఫున రోడ్డుకు ఇరువైపులా బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాల నిర్వహణ చేయిస్తామని అధ్యక్షుడు తిరుపతయ్య తెలిపారు. 600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తుతోపాటు, ప్రధాన తిరునాళ్ల రోజున మేదరమెట్ల పైలాన్ వద్ద, సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద భారీ వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని చీరాల డీఎస్పీ శ్రీకాంత్ వివరించారు. తిరునాళ్ల రోజున నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు చెప్పారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ జామ్ తదితర సమస్యల సమయంలో ఉపయోగపడేలా ఒక క్రేన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ, అగ్నిమాపక, ఆరోగ్య శాఖలు, నరసింహస్వామి దేవస్థానం తరఫున, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు చేపట్టనున్న చర్యలు, ఏర్పాటు చేయనున్న వసతుల గురించి వివరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున తిరునాళ్లలో ప్రభల వద్ద ఇతర ప్రాంతాల్లో ఎటువంటి పార్టీ జెండాలు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. కోడ్‌ను అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నరసింహస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నర్రావుల కొండలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు సాధ్యం

- కేజీబీవీ, జగనన్న కాలనీ లేఅవుట్ల తనిఖీ
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

బల్లికురవ: ఆడపిల్లల చదువు ఆ ఇంటికే వెలుగునిస్తుందని, లక్ష్యంతో ధైర్యంగా చదివితే పదిలో మంచి ఫలితాలు సాధించవచ్చని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. గురువారం బల్లికురవలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థులతో ముచ్చటించారు. జీవితంలో స్థిరపడే వరకు వివాహాలు చేసుకోవద్దని, బాలికలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. విద్యాలయంలో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యలో వెనుకబడిన బాలికలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ముందుకు తీసుకురావాలన్నారు. బాలికలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ప్రిన్సిపాల్ సరళకుమారిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ఆవిష్కరించారు. మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలాల వారీగా ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి

ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా మంజూరు చేసిన గృహాలను మార్చి 20వతేదీలోపు పూర్తి చేయించి ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బల్లికురవలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఆమె పరిశీలించారు. కాలనీకి 20 గృహాలు మంజూరు కాగా పది మాత్రమే పూర్తయ్యి, మిగతావి అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులతో మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. బల్లికురవ కూడలిలోని నాలుగు రోడ్లలో ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించనందున సైడు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఆర్డీఓ సరోజిని, తహసీల్దార్ పీ. సీతారత్నం, గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, ఈఈ దాశరథిశర్మ, డీఈఓ పీవీజే రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, వైద్యాధికారి రమీజ్ అహ్మద్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

యాలి వాహనంపై నారసింహుడు

మంగళగిరి:మంగళగిరి పట్టణంలో వేంచేసివున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారంరాత్రి యాలి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. యాలి వాహన రూఢుడైన స్వామి వారిని దర్శిస్తే దుర్మార్గుల వలన భయం నశిస్తుందని భక్తుల నమ్మకం. ఉత్సవానికి నగరానికి చెందిన మురికిపూడి మాధవరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పుష్పవేణి కుమారులు కైంకర్యపరులుగా వ్యవహరించగా ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. యాలి వాహనంపై ఆశీనుడైన శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళావేదికపై ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు సింహవాహనంపై విహరించనున్న స్వామి

నరసింహస్వామి శుక్రవారం రాత్రి ఏడు గంటలకు సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.



యాలి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నృసింహస్వామి

పొరుగు వేటకు సన్నద్ధం

బాపట్ల: వేటలో బాపట్ల ప్రాంత మత్స్యకారులు సిద్ధహస్తులు. ఈ ప్రాంత మత్స్యకారులను వేటకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తీసుకెళుతుంటారు. మన రాష్ట్రంలో ఏప్రిల్ 15 నుంచి మే 31వరకు వేట నిషేధం విధించడం ఆనవాయితీ. తిరిగి జూన్ ఒకటో తేదీ నుంచి వేటకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. ఈ నేపథ్యంలో బెంగళూరు, గోవా వెళ్లేందుకు మత్స్యకారులు సిద్ధమౌతున్నారు. వేట నిషేధం సమయంలోనే ఇతర రాష్ట్రాలకు వేట కోసం వెళ్లే మత్స్యకారులు ఈ ఏడాది నెలరోజులు ముందే సన్నద్ధమవుతున్నారు. బాపట్ల అడవిపల్లిపాలెం, దాన్వాయ్‌పేట, కృపానగర్, రామచంద్రపురం, పాండురంగాపురం, సూర్యలంక, రామానగ ర్, ముత్తాయిపాలెం, హనుమాన్‌నగర్‌లలో ఎనిమిది వేల మంది, నిజాంపట్నం మండలంలో సుమారు ఐదువేలమందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తుంటారు. వీరిలో ఎక్కువ శాతం మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వేటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



గుడారాల పండుగను ప్రారంభిస్తున్న పాస్టర్ మోహన్ సి.లాజరస్, బ్రదర్ అబ్రహం



ప్రార్థనలకు భారీగా తరలివచ్చిన విశ్వాసకులు

భక్తి 'గుడారం'.. స్తుతి నైవేద్యం

గుంటూరు నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో 46వ గుడారాల పండుగ భక్తిశ్రద్ధలతో ప్రారంభం అయ్యింది. గురువారం తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సి. లాజరస్ సభను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, పాస్టర్‌లు ప్రైడిపాల్, రాజు, రమేష్, జాన్ వెస్లీ హాజరయ్యారు. పాస్టర్ జాన్‌వెస్లీ వాక్యసందేశం అందిస్తూ ఏసుక్రీస్తు యదార్థవంతుడు, న్యాయమంతుడని అన్నారు. భయభక్తులు కలిగిన వారికి ఆయన కృప ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయనను నమ్మినవారికి సంక్షేమాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధి, విజయాభివృద్ధి కలుగుతుందని వివరించారు. ఆదివారం మధ్యాహ్నం వరకూ ఈ పండుగలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. – గుంటూరు రూరల్

ఆరేళ్ల బాలికతో 70 ఏళ్ల వృద్ధుడి అసభ్య ప్రవర్తన

ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

చీరాల: మనవరాలి వయసున్న ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడో 70 ఏళ్ల వృద్ధుడు. ఇంటి సమీపంలో ఉంటూ అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లే ఆరేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి వెకిలి చేష్టలతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. చివరకు స్థానికులు, బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసులో చిక్కుకుని కటకటాల పాలయ్యాడు. ఈ సంఘటన బాపట్ల జిల్లా చీరాల రూరల్ పరిధిలోని ఈపూరుపాలెంలో జరిగింది. ఎస్‌ఐ జనార్దన్ తెలిపిన వివరాల మేరకు ఈపూరుపాలెం పురుగుల పేటకు చెందిన చినకొండయ్య (70) సమీపంలో నివాసం ఉండే ఆరేళ్ల బాలికకు చాక్లెట్ ఆశ చూపి రోజూ ఇంటికి తీసుకెళ్లేవాడు. అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లి వస్తుండే సమయంలో చిన్నారిని ఇంటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. కొంతకాలంగా వృద్ధుడిని గమనించిన స్థానికులు చిన్నారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వృద్ధుడిని చితకబాదారు. అలానే ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు వృద్ధుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


మృతిచెందిన చెన్ను వీర్రాజు

నిజాంపట్నం: వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన నిజాంపట్నంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నిజాంపట్నంకు చెందిన చెన్ను వీర్రాజు(33) బుధవారం సాయంత్రం రేవులో వేట చేసేందుకు బయలుదేరి వెళ్లాడు. రాత్రికి తిరిగి ఇంటికి రాకపోవడంతో వీర్రాజు కోసం బంధువులు, కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికారు. అయినా కనిపించలేదు. గురువారం ఉదయం నిజాంపట్నం బోట్ల రేవులో వలకు చిక్కుకుని శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ రమేష్, సిబ్బంది వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పంపించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వాహనాలు

చినగంజాం: ఎదురెదురుగా ట్రాక్టర్, కారు ఢీకొట్టుకోవడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన గురువారం కడవకుదురు వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. హైవే సంచార పోలీస్ సిబ్బంది వివరాల మేరకు.. పందిళ్లపల్లి రైల్వే గేట్ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై చీరాల రోడ్డులో ట్రాక్టర్ కడవకుదురు నుంచి పందిళ్లపల్లి వైపు వెళ్తోంది. అదే సమయంలో పొన్నూరు నుంచి నెల్లూరు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ట్రాక్టర్‌ను ఎదురుగా ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు కాగా, ట్రాక్టర్ ట్రక్కు తిరగబడింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ పెట్లూరు మధుసూదన్, కారులో ప్రయాణిస్తున్న ఎస్.వెంకట సుబ్బరాజు, యనమలమంద మాల కొండయ్య, యనమలమంద విజయమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. కాగా వారిని 108 వాహనంలో, టోల్ ప్లాజా అంబులెన్స్‌లో చీరాల వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ కీర్తి ఆదినారాయణ సురక్షితంగా ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కట్టా అనూక్ తెలిపారు.

అంతర్జాతీయ శిక్షణకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తైవాన్ దేశంలోని ప్రపంచ కూరగాయల కేంద్రంలో శిక్షణకు ఎంపికయ్యారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థినుల అభినందన కార్యక్రమం కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐడీపీ(ఎన్.ఎ.హెచ్.ఎ.పి) లో భాగంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో తమ కళాశాలకు చెందిన బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థినులు ఐ.రమాసాయి మంజూష, పి.స్పందన, టి.వైష్ణవి, జి.యామినిదేవి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థినులు విత్తన సాంకేతికత, మొక్కల రక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ విధానాలపై సమీక్ష మొదలగు అంశాలపై శిక్షణ పొందుతారన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీవరకు శిక్షణ ఉంటుందని వివరించారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఈ అంతర్జాతీయ శిక్షణకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. డా. కె.చంద్రశేఖర్, డా.వి. సీతారాం బాబు, డా.బి.రత్నకుమారి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

నగరం(రేపల్లె): అనుమానాస్పద స్థితిలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన నగరం మండలంలోని అద్దంకివారిపాలెంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. అద్దంకివారిపాలేనికి చెందిన అద్దంకి గోపయ్య(29) సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. సెలవులపై గత నెల 8న ఇంటికి వచ్చాడు. అయితే, ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిన గోపయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేశారు. గ్రామ సమీపంలోని మొక్కజొన్న పొలంలో గురువారం గోపయ్య మృతదేహం కనిపించింది. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

సత్తెనపల్లి: భారతదేశాన్ని మనువాద, మతోన్మాద శక్తుల నుంచి రక్షించుకోవాలని రాష్ట్ర పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జరిగే భారత్ బచావో జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జన విజ్ఞాన వేదిక పట్టణ శాఖ ఆధ్వర్యంలో కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు.

చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు

పట్నంబజారు: గుంటూరు నగరంలో ఓ నివాసంలో భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో గురువారం ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.సీతారామయ్య, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం యాదగిరి గుట్టమండలం యాదగిరిపల్లెకు చెందిన క్లెం రవికుమార్ అలియాస్ పత్తి రవి అలియాస్ ఆర్కే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం పలు చోరీలకు పాల్పడ్డాడు. అనంతరం గుంటూరు జిల్లా పెదకాకానిలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసం ఉంటూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేయడం ప్రారంభించాడు. ఈక్రమంలో గతనెల 6వ తేదీ తిరుపతి వెళ్లిన గుంటూరు చౌత్రాసెంటర్, పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన నూకల మురళీకృష్ణ నివాసంలో చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న బీరువాలోని బంగారాన్ని దోచుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి ఆచూకీ కోసం యత్నించగా, గురువారం గుంటూరు చౌత్రా సెంటర్‌లో దొంగిలించిన బంగారం విక్రయించేందుకు వచ్చినట్లు గుర్తించి, పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో చోరీకి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించారు. నిందితుడి వద్ద 373 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్‌ఐలు ఆర్.ఎం.విజయ్‌కుమార్, కె.అమర్‌వర్ధన్, కానిస్టేబుళ్లు నాగూర్‌వలి, రవి, సుబ్బారావు, కిరణ్‌లను అభినందించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి



ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

గుంటూరు ఈస్ట్: లాం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, షేక్ ఆలియా దంపతుల రెండు సంవత్సరాల కుమార్తె హషీదాను గురువారం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఇంటి ముందు ఆడుకుంటున్న తమ కుమార్తెపై శునకాలు దాడిచేశాయని చెప్పారు. గాయపడిన తమ కుమార్తెకు అదేరోజు జీజీహెచ్‌లో మొదటి డోసు ఇంజక్షన్ వేయించామన్నారు. రెండో డోసు ఇంజక్షన్ వేయించేందుకు గురువారం జీజీహెచ్‌కు వచ్చామన్నారు. తమ కుమార్తెపై శునకాలు దాడిచేసిన విషయాన్ని లాం గ్రామ పంచాయతీ అధికారులకు తెలియజేశామని, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కుమార్తె మొఖం, చేతులు, వీపుపై పలు చోట్ల కుక్కలు తీవ్రంగా కరిచాయని వివరించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన గురువారం చీరాల–వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. చీరాల–వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య ఎంజీసీ హౌసింగ్ కాలనీ సమీపంలో సుమారు 30–35 ఏళ్ల వయస్సు కలిగిన మహిళ ఎగువ లైన్ రైలు పట్టాలపై మృతి చెందినట్లు సమాచారం అందిందని చెప్పారు. ఈమేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతురాలు ఎరుపు రంగు చాయ కలిగి ఉన్నట్లు చెప్పారు. అలానే మృతురాలు శరీరంపై ఆకు పచ్చ రంగుపై ఎరుపురంగు పూల డిజైను కలిగిన పంజాబీ టాప్, ఎరుపు పంజాబీ డ్రస్ ప్యాంట్, స్నఫ్ కలర్ స్లిప్పర్లు, కుడి చెవికి సత్తు కమ్మ ఉన్నట్లు చెప్పారు. మృతురాలి ఆచూకీ తెలిసినట్లయితే జీఆర్పీ పోలీసులు 94406 27646 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

ఉన్నతి రుణాన్ని సొంతానికి వాడుకున్న సీసీ

- గ్రూపు సభ్యుల సంతకాలు ఫోర్జరీ
- ఎస్సీ వర్గాలకు అందజేసే రుణాలను ఓసీ మహిళల పేరిట పొందిన వైనం


సుభాషిణీ డ్వాక్రా గ్రూపు సభ్యులు

జే.పంగులూరు: ఎస్సీ వర్గాలకు అందించాల్సిన రుణాలు పక్కదారి పట్టించి సొంతానికి వాడుకున్న అధికారుల భాగోతం బయటపడింది. పంగులూరు మండల పరిధిలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో ఈ వివాదం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. సుభాషిణీ డ్వాక్రా గ్రూపులో ఐదుగురు సభ్యుల పేర్ల మీద ఆ సభ్యులకు తెలియకుండా అప్పటి సీసీ నరేంద్ర శ్రీలక్ష్మి, వీఓఏ ధనలక్ష్మి ఇరువురు కలిసి ఉన్నతి రుణం రూ.2.43లక్షల కోసం దరఖాస్తు చేశారు. ఈ రుణం కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఇచ్చేది. కాని రుణం కోసం దరఖాస్తు చేసుకున్నట్లుగా వీరు చూపించిన సుభాషిణీ డ్వాక్రా గ్రూపులోని సుభాషిణీ, లక్ష్మి, పద్మ, ధనలక్ష్మి, శివలు ఓసీ వర్గాలకు చెందిన వారు. అయితే వీరందరికీ రుణం మంజూరయింది. ఈ తతంగమంతా వీఓఏ, సీసీలు గ్రూపు సభ్యులకు తెలియకుండా తీర్మానం రాసి, సంతకాలు ఫోర్జరీ చేశారు. అంతేకాకుండా కుల ధ్రువీకరణ నకళ్లు సైతం తయారు చేయించి, మేనేజ్ చేసి రుణం తీసుకున్నట్లు వినికిడి. అయితే ఈ తీర్మానాన్ని అప్పటి ఏపీఎం కూడా తీర్మానించి సంతకం చేయడం విశేషం. ఉన్నతి లోను రూ. 2.43 లక్షలు మంజూరై సుభాషిణి డ్వాక్రా గ్రూపులో జమఅయ్యింది. ఈ డబ్బులను గ్రూపులో లీడర్లకు ఇద్దరికి ఆరోగ్యం బాగోలేదని చందలూరు కెనరా బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేశారు. అప్పటి నుంచి ఇంతవరకు ఉన్నతి లోను సంబంధించి డబ్బులు కట్టలేదు.

బయట పడిందిలా..

ఇటీవల గ్రూపు సభ్యులు రుణం తీసుకునేందుకు కెనరా బ్యాంక్‌ను సంప్రదించగా, బ్యాంక్ అధికారి ఆ గ్రూపు నుంచి గతంలో ఏమైనా రుణాలున్నాయేమో, లేవోనని వెలుగు కార్యాలయం అధికారులను వివరాలు కోరగా సదరు గ్రూపు 2021లో రుణం తీసుకున్నారని అవి ఇంతవరకు జమచేయలేదని తెలిపారు. దీంతో గ్రూపు సభ్యులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. అప్పటి వీఓఏ ధనలక్ష్మిని నిలదీయగా, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పాత తీర్మానాలు బయటకు తీయగా నిజం ఒప్పుకొందని గ్రూపు సభ్యులు తెలిపారు. ఈ మేరకు సీసీచే ఉన్నతి పథకం రుణం కట్టించాలని గురువారం వెలుగు కార్యాలయంలో సభ్యులు వినతి పత్రం అందజేశారు. అప్పటి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రూపు సభ్యులు కోరుతున్నారు.

ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న జగనన్న గృహ సముదాయాల్లోని ఇళ్ల ఉగాది నాటికి పూర్తయి, గృహప్రవేశాలు జరిపేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22 తెలుగు సంవత్సరాది నాడు అధిక సంఖ్యలో ప్రారంభోత్సవాలుంటాయన్నారు. ఇప్పటికే దాదాపు పూర్తయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్, మంచినీటి సదుపాయం, రోడ్ల అభివృద్ధి తదితర కార్యక్రమాలు పూర్తికావచ్చాయని చెప్పారు. గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. గ్రామ కంఠ భూములకు సైతం రీ సర్వే చేశామని చెప్పారు. త్వరలోనే కొన్ని పట్టాలు కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద అర్హులైన రైతుల నుంచి ఆర్బీకేల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మైక్రో డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి వినియోగం తగ్గించి పంట పొలాలకు నలుమూలల నీరందించే ప్రక్రియకు డిమాండ్ పెరుగుతుందన్నారు. జగనన్న పాల వెల్లువ పథకాన్ని గ్రామ గ్రామాలకు విస్తరిస్తున్నామని, రైతులకు బ్యాంకు రుణాల ద్వారా గేదెలను సమకూర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జేసీ జి.రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివ రామిరెడ్డి, జడ్పీ సీఈఓ మోహన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల ప్రాణాలను నిలబెట్టాల్సిందే

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- వైద్యాధికారుల సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, పక్కన డీఎంహెచ్‌ఓ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో హై–రిస్క్ గర్భిణుల మరణాల నివారణకు వారికి అత్యవసర ప్రాణాంతక సమయంలో వైద్య ఆరోగ్యశాఖ, సిబ్బంది తప్పనిసరి పర్యవేక్షణ చేపట్టి ప్రాణాలను నిలబెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో మాతృమరణాల నివారణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గతేడాది అక్టోబరు నెల నుంచి 2023 ఫిబ్రవరి నెల మొదటి వారం నాటికి జరిగిన ఐదు మాతృమరణాలపై సమీక్ష చేశారు. అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో అటువంటి మరణాలు సంభవించకుండా తీసుకోవలసిన చర్యలు, ఏ స్థాయిలో లోపం ఉందో గమనించి, మానవ తప్పిదాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్య విధానం అమలు విషయంలో ఎక్కడా లోపం లేకుండా, అవసరమైన వనరులను, వసతులను వెంటనే ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యతో వచ్చిన ప్రతి గర్భిణీకి పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, లోపాలను గుర్తించి సక్రమ వైద్య సేవలను అందించి, సుఖవంతమైన ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజుపాలెం, కావూరు, నాదెండ్ల, 75 తాళ్లూరు, ఫణిదం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మరణాలపై సమీక్షలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. మాతృమరణాలు జరిగిన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు పారా మెడికల్ సిబ్బంది, బాధిత కుటుంబాలతో మాట్లాడి తగిన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రధానంగా థైరాయిడ్‌తో బాధ పడే ప్రతి గర్భిణీకి ఈసీట, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్షలు జరిగేలా చూడాలని, ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం ప్రభుత్వ సహకారంతో ఆరోగ్యశ్రీ ఉచిత సేవలు గర్భిణులకు తప్పనిసరిగా అందాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, డీసీహెచ్ డాక్టర్ రంగారావు, గైనకాలజీ వైద్య నిపుణులు, పలువురు జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 546.80 అడుగుల వద్ద ఉంది. ఇది 202.7842 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,120, ఎడమకాలువకు 9,166, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 20,026, ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 42,112 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 11,556 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

జిల్లాస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

యద్దనపూడి: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పూనూరు ఫిజికల్ డైరెక్టర్ టి.అంకరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఆదివారం పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు న్యూ తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ సెలక్షన్‌లో క్రీడాకారులు తమ పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12వ తేదీల్లో విశాఖపట్నంలోని యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 94939 23121 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.